క్లుప్తంగా

ఆత్మకూరు వాసికి అరుదైన గుర్తింపు


ప్రొఫెసర్ లక్ష్మీకుమార్

ఆత్మకూరు : ఆత్మకూరుకు చెందిన ఢిల్లీ ఐఐటీలో వాతావరణ శాఖ ప్రొఫెసర్‌గా చేస్తున్న టి.లక్ష్మీకుమార్ ఇండియన్ మెటీరియాలజి సొసైటీ(ఐఎంఎస్) అసోసియేట్ ఫెలో అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు ఐఎంఎస్ నుంచి మంగళవారం ఆహ్వానం అందింది. ఈనెల 10న ఒడిస్సాలోని రౌర్కెలా నిట్ కేంద్రంలో ఆయన అవార్డును అందుకుంటారు. దీంతో స్థానిక సహచరులు, పలువురు ఉపాధ్యాయులు లక్ష్మీకుమార్‌ను మంగళవారం అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీఓ పావని

ఆత్మకూరు : భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని సూచించారు. ఆమె తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. వాగులు, వంకల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సోమశిల, సంగం జలాశయాల అధికారులు ముందస్తు హెచ్చరికలు చేసి నీటి విడుదల చేయాలని ఆదేశించారు.

సత్కారం


సన్మానం అందుకున్న వైద్యులు

కావలి : గుంటూరులో జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశంలో మూడు విభాగాల్లో అవార్డులు సాధించిన కావలి ఐఎంఏ ప్రతినిధులను మంగళవారం సత్కరించారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో కావలి ఐఎంఏ అధ్యక్షుడు కామంచి సుబ్బారావు, కార్యదర్శి గోపీ, కోశాధికారి పి.శివప్రసాద్, సతీష్, ఉషారాణిలను రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ సన్మానించి, అభినందనలు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కావలి : రూరల్ మండలం కొనదిన్నె గ్రామంలో జంపాని తిరుపతిస్వామి అనే వ్యక్తి 12 క్వార్టర్ బాటిళ్లు అక్రమంగా కలిగి ఉండడంతో మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు చెప్పారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఎం.దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

రావులకొల్లులో పశువైద్య శిబిరం


పాడిరైతులకు మందుల పంపిణీ

కలిగిరి : రావులకొల్లులో కలిగిరి పశువైద్యశాల ఏడీ డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 54 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. లేగదూడలు, గొర్రెలకు ఏలికపాముల నివారణ మందులు తాగించారు. 75 శాతం రాయితీతో పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. పశువైద్యులు లక్ష్మీప్రసాద్, వీరహరణ్, సర్పంచ్ వెంగపనాయుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



అనుమసముద్రంపేట : విద్యుదాఘాతంతో ఓ గేదె మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి అనుమసముద్రంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సచివాలయ సమీపంలో రిలయన్స్ సంస్థ టవర్లు ఉన్నాయి. అక్కడే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం ఏర్పాటు చేసి ఉన్నారు. అయితే దీని చుట్టూ ప్రహరీ లేకపోవడంతో గేదెలు మేత కోసం వెళ్తుంటాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి వర్షం కురుస్తున్న నేపథ్యంలో గేదెలు ఆ ప్రాంతానికి వెళ్లాయి. అందులో ఓ గేదె ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కావలి : పట్టణంలోని బుడంగుంట కాలనీలో కంపచెట్ల మధ్య పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,300ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్సైలు ఎం.బాజీబాబు, సీహెచ్.తిరుమలరెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

మెట్టపై వాన పడగ

మెట్ట ప్రాంతాలపై వరుణుడు పడగ విప్పారు. గత మూడు, నాలుగు రోజులుగా కురిసిన వర్షం నుంచి తెరుకునేలోపు ఒక్కసారిగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం మధ్య ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో పంటలు నీట మునిగాయి. వాగులు పొంగడంతో గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- దెబ్బతిన్న పంటలు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు


వరికుంటపాడు : బోయమడుగుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లా పేరు వాగు


ఉదయగిరి : మండలంలో నేలవాలిన వరిపంట

వరికుంటపాడు : మండల పరిధిలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అధికారులు తెలిపిన గణాంకాల ప్రకారం 41.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫలితంగా గ్రామాల్లో సాగులో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట పూర్తిగా నేల వాలింది. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్నారు. అలాగే పలు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. గువాడి చెరువు అలుగు పారుతోంది. తూర్పు బోయమడుగుల–జి.కొత్తపల్లి ప్రధాన రహదారి మార్గంలోని పిల్లా పేరు వాగు, పెద్దిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహమ్మదాపురం నుంచి కురప వానిపల్లికి వెళ్లే మార్గంలో నిర్మించిన బ్రిడ్జి వద్ద పోసిన మట్టి కోతకు గురై రాకపోకలు స్తంభించాయి. పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శి, స్థానికులు కలిసి యంత్రాల సహాయంతో మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. వర్షానికి తోడు చలిగాలులు కూడా తోడవడంతో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని తెలియడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డివిజన్ పరిధిలో..

వరికుంటపాడు : కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సాధారణ వర్షపాతం నమోదైంది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. వరికుంటపాడు మండలంలో 41.8, కొండాపురం 32.4, లింగసముద్రం 28.4, వాలేటివారిపాళెం 22.4, గుడ్లూరు 17.8, కందుకూరు 16.2, ఉలవపాడు 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- మండల పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న పైర్లను మంగళవారం ఏఓ రవికుమార్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జి.కొండారెడ్డిపల్లి, కొండ్రాజుపల్లిలో కోతదశలో ఉన్న వరిపైరుతో పాటు విరువూరులో నాటిన శనగ పంట దెబ్బతిన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

దెబ్బతిన్న వరినాట్లు, నారుమళ్లు

జలదంకి : భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు, నారుమళ్లు దెబ్బతిన్నాయి. నీరు అధికంగా చేరడంతో వరి నారుమడులు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. బ్రాహ్మణక్రాక, కొత్తపాళెం, వేములపాడు, చినక్రాక, కమ్మవారిపాళెం, చామదల తదితర పంచాయతీల్లో అధికశాతం వరినాట్లు నీట మునిగాయి. కాగా బ్రాహ్మణక్రాక సమీపంలోని నాయుడు చెరువు, పేరపనాయుడు చెరువు పరిధిలో అధికంగా వరినాట్లు, నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

- **ఉదయగిరి :** మండల పరిధిలో కోతకొచ్చిన వరిపైరును ఏఓ ఆంజనేయులు నాయక్ మంగళవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.
- **దుత్తలూరు :** మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో కొన్ని పంటలకు ప్రయోజనం చేకూరగా, శనగ పంటకు నష్టం వాటిల్లింది. మండల ఏఓ వెంకటసుబ్బారెడ్డి పలు ప్రాంతాల్లో పంట పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. మండలంలో 330 హెక్టార్లలో శనగ సాగుచేసినట్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామన్నారు. ఏఈఓ సుస్మిత ఉన్నారు.
- **ఆత్మకూరు :** మండల పరిధిలో జోరు వర్షం కురిసింది. పట్టణంలోని తూర్పువీధి అలఘునాథ స్వామి ఆలయ సమీపంలో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. కొలగానిరామయ్య సత్రం ప్రాంతంలోని చింతచెట్లకాలనీలో రోడ్లు జలమయమయ్యాయి. వెంకట్రావుపల్లి ఎస్టీకాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. వీవర్స్‌కాలనీలో రోడ్లు బురదమయంగా మారింది. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరులో 34.6, సీతారామపురం 69.2, ఉదయగిరి 55.4, సంగం 42.4, అనంతసాగరం 44.8, మర్రిపాడు 20.6, ఏఎస్‌పేట 29.8, కలువాయి 27.8, చేజర్ల 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు.
- **కలిగిరి :** మండల పరిధిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- **బిట్రగుంట :** బోగోలు మండలంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. 52.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోగోలు, విశ్వనాథరావుపేట, కప్పరాళ్లతిప్ప తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీరు నిలిచిపోవడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- **కొండాపురం :** మండలంలో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సత్యవోలు, అగ్రహారం మధ్య మిడత వాగు పొంగింది. పంట నీట మునిగింది.
- **సీతారామపురం :** భారీ వర్షాలకు మండలంలోని మారంరెడ్డిపల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఇరవై హెక్టార్లలో వరిపంట నేలవాలినట్లు మండల ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. వరిపంట కోత దశలో నేల వాలిందన్నారు. నష్టంపై నివేదిక పంపామన్నారు.
- **ఉదయగిరి :** వర్షం ప్రభావంతో వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో కోతకొచ్చిన వరి నేలకొరిగింది. ఉదయగిరి– బండగానిపల్లి ఘాట్‌రోడ్డు కొంత మేర కోసుకుపోయింది. వింజమూరు మండలంలోని పలు గ్రామాల్లో పొగాకు చేలల్లో నీరు నిలిచింది. మలపరాజు చెరువు, పాతూరు చెరువు, చాకలికొండ చెరువులకు నీరు చేరింది.


బిట్రగుంట: బేతనీయపేటలో విద్యార్థుల అవస్థలు


ఆత్మకూరు: వీవర్స్‌కాలనీలో అధ్వానంగా రోడ్డు


వరికుంటపాడు : జి.కొండారెడ్డిపల్లిలో నేలవాలిన పంటను పరిశీలిస్తున్న సిబ్బంది


వరికుంటపాడు : భోగ్యంవారిపల్లిలో బంతి తోటలో వర్షపునీరు


జలదంకి : బ్రాహ్మణక్రాక వద్ద మునిగిన వరినాట్లు


దుత్తలూరు : నీరు నిలిచిన పొలాలను పరిశీలిస్తున్న ఏఓ


దుత్తలూరులో కురుస్తున్న భారీ వర్షం


సీతారామపురం : మారంరెడ్డిపల్లిలో నేలవాలిన వరిపైరు

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

- డీఏఓ సత్యవాణి

చేజర్ల : రైతులు మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తే అనర్థాలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) పి.సత్యవాణి అన్నారు. మండలంలోని ఏటూరు, వావిలేరు గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొని, మాట్లాడారు. అధిక యూరియా వాడకం వల్ల తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని తెలియజేశారు. పంట వేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పంటల బీమా గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, పొదలకూరు ఏడీఏ శివనాయక్, మండల ఏఓ శశిధర్, వీఏఏ సూర్యనారాయణ, సర్పంచ్ కె.నాగబూషణమ్మ పాల్గొన్నారు.

- **సోమశిల(ఆత్మకూరు) :** అనంతసాగరం మండలంలోని కామిరెడ్డిపాడు, ఆమనిచిరువెళ్ల గ్రామాల్లో నీట మునిగిన నారుమడులను ఏఓ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.



ఏటూరులో మాట్లాడుతున్న డీఏఓ

- **ఆత్మకూరురూరల్ :** వరి నారుమళ్లలో నిలిచిన నీటిని వెంటనే తొలగించి యూరియా, పొటాష్‌ను సమపాళ్లలో చల్లాలని ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని నువ్వూరుపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కిశోర్‌బాబు, వీఏఏ ప్రవల్లిక పాల్గొన్నారు.
- **సీతారామపురం :** రైతులు బీమా పథకం కింద ప్రీమియం సొమ్ము చెల్లించాలని మండల ఏఓ చెన్నారెడ్డి సూచించారు. ఆయన మంగళవారం బసినేనిపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీమా ప్రయోజనాలను వివరించారు.

మెరుగైన సేవలు అందించండి

ఉదయగిరి : తపాలా ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉదయగిరి ప్రాంత తపాలా ఉద్యోగులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటికీ బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత లక్ష్యాలు సాధించిన ఉద్యోగులకు వెండి నాణేలు, బ్యాగులు అందజేశారు. ఐపీఓ వి.సాయికృష్ణారెడ్డి, ఏపీఎంలు, బీపీఎంలు, జీడీఎస్‌లు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న సూపరింటెండెంట్

మంత్రి ఆకస్మిక తనిఖీ

బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఇటీవల పదో తరగతి విద్యార్థిని పాముకాటుకు గురవడం, అంతకు ముందు మరో విద్యార్థిని రాత్రి వేళ విషపురుగు కాటుకు గురవడం చర్చకు దారితీశాయి. ఈ క్రమంలో మంత్రి గురుకుల పాఠశాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. తరగతి గదులు, పరిసరాలు, వసతి గృహ సముదాయాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి వేళల్లో విష పురుగులు, దోమల బెడద లేకుండా అన్నిచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నేత మాలెపాటి నాగేశ్వరరావు ఉన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

జలపాతం కనువిందు


ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రసిద్ధ శైవక్షేత్రమైన భైరవకోనలో జలపాతం కనువిందు చేస్తోంది. పర్యాటకులను ఆకర్షిస్తోంది. – సీతారామపురం

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవాలి


కావలి : బహుమతులు అందజేస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్


కావలి : చిన్నారులకు బహుమతులు

కావలి : విభిన్న ప్రతిభావంతులకు సమాజం అండగా నిలవాలని కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక మెప్మా ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగులు) దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు వారి హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జె.భారతి, ఆర్గనైజర్లు కిరణ్‌కుమార్, సైలమ్మ, రీనా ఎలిజిబెత్, లక్ష్మీప్రసున, సునీత, కంప్యూటర్ ఆపరేటర్స్ బైరాగిరెడ్డి, ఖాజారంతుల్లా పాల్గొన్నారు.

- పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులో ఉన్న 'భవిత' కేంద్రంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన ప్రతినిధుల సహకారంతో చిన్నారులను బహుమతులు ప్రదానం చేశారు. టీచర్లు కె.మమత, ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందీ టీచర్లు కె.అంజయ్య, సంపత్‌లు బహుమతులు వితరణ చేశారు. ఎంఈఓ గోవిందయ్య, సీఐ జి.రాజేశ్వరరావు పాల్గొని వాటిని అందజేశారు. సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర చిన్నారులకు దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో సక్ష్యం ప్రతినిధులు డాక్టర్ కూనపరెడ్డి మాధవరెడ్డి, దాకారపు రవిప్రకాష్, నాగమణి, జీటీ స్వామి పాల్గొన్నారు.
- **ఆత్మకూరు :** పట్టణంలోని ఎంపీపీఎస్ వెస్ట్ పాఠశాల భవిత సెంటర్‌లో హెచ్‌ఎం వై.సీతాదేవి పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని తెలిపారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ఐఈఆర్పీలు కె.పద్మ, జయకుమార్‌లను అభినందించారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, మంజులవాణి, ధనమ్మ, శశికళ పాల్గొన్నారు.
- **ఉదయగిరి :** స్థానిక భవిత కేంద్రంలో జరిగిన దివ్యాంగుల దినోత్సవంలో హెచ్‌ఎం బాలకేశవులు పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగుల్లో దాగున్న ప్రతిభను ప్రోత్సహించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు షబ్బీర్, రామకృష్ణారెడ్డి, వెంకటరమణ, నరసింహ, ఐఈఆర్టీలు శివనందిని, సుభాస్‌చంద్రబోస్ పాల్గొన్నారు.
- **అనుమసముద్రంపేట :** ఏఎస్‌పేట హిందూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ–2 సాయిప్రసాద్ దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, విద్యాసామగ్రిని అందజేశారు. వారి తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం సుల్తానా, ఐఈఆర్పీలు ఎండీ రెహమాన్, పి.మోహన్, ఫిజియోథెరపిస్ట్ రఫీ పాల్గొన్నారు.
- **సంగం :** స్థానిక నార్త్ స్కూల్ భవిత కేంద్రంలో ఐఈఆర్టీ పెంచలమ్మ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ–2 మల్లయ్య పాల్గొని దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం పోలయ్య, పాల్గొన్నారు.
- **జలదంకి :** స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రమీల, ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్లు అందించారు.
- **కొండాపురం :** స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓ కె.రవికుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.
- **వింజమూరు(ఉదయగిరి) :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **సీతారామపురం :** స్థానిక విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఎంఈఓ మస్తాన్‌వలీ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, భవిత కేంద్రం హెచ్‌ఎం తిరుపతయ్య, ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరి, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.


ఆత్మకూరు: భవిత కేంద్రంలో..


ఉదయగిరి భవిత కేంద్రంలో..


అనుమసముద్రంపేట ఎంపీపీ పాఠశాలలో..


సంగంలో..


జలదంకి : దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్ అందజేత


సీతారామపురంలో..


వింజమూరులో..

సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కార్యాలయం ఎదుట మంగళవారం డిపాజిట్ స్కీములపై కరపత్రాలు ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యార్థులకు ఆర్థిక ఆసరా కల్పించేలా ఏటా కొంత నగదు డిపాజిట్ చేస్తే ఎంతో మేలు అని తెలిపారు. సూపర్‌వైజర్ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కీర్తి సుదాస్, సిబ్బంది ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ



ఆత్మకూరు : పట్టణంలోని జేఆర్‌పేట వినాయక మండపంలో అయ్యప్పస్వామి మహాపడి పూజను మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, అయ్యప్ప, సుబ్రహ్మణ్యం స్వాములకు అష్టోత్తర పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు గావించారు.

బ్యాంక్ సేవలపై కళాజాత

వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో కెనరా బ్యాంక్ సేవలపై మంగళవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విజయ్, మహేష్ పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత

దుత్తలూరు : విద్యతోనే బంగారు భవిత సాధ్యమని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దిన్ తెలిపారు. మండలంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.